క్లుప్తంగా

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన


ఆధునికీకరించిన ప్రభుత్వ వసతి గృహం

మహారాణిపేట : పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సంక్షేమ వసతి గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. తొమ్మిది సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, 5 వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఒక గిరిజన సంక్షేమ వసతి గృహానికి రూ.5 కోట్ల 63 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు 18 నెలల్లో అధికారులు ఈ పనులు పూర్తి చేశారు. ఆధునికీకరించిన వసతి గృహాల్లో మొత్తం 1950 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విశాఖ విద్యా వసతి వికాసంలో భాగంగా ఆదివారం 250 మంది విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా మూడు ప్రభుత్వ వసతి గృహాల పనులు చేపట్టారు.

రోగులకు డాక్టర్ తనూజారాణి పరామర్శ


కేజీహెచ్‌లో రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ తనూజారాణి

మహారాణిపేట : అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతీ సర్పంచ్ పూజారి మేరీ, అదే పంచాయతీకి చెందిన డుంబేరి స్వప్నను వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందజేయాలని తెలిపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం


కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్న జిల్లా బాలభవన్ విద్యార్థులు

అల్లిపురం : బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం సాయంత్రం జిల్లా బాలభవన్ విద్యార్థుల కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆచార్యులు లలిత ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం తిలకించిన వారంతా భక్తిపారవశ్యంతో తరించారు.

దైవచింతనతో దివ్యమైన జీవితం


నిరుపేదలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న శ్యామ్ మింది

దాబాగార్డెన్స్ : నగరంలోని చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో రెఫ్యూజ్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ శ్యామ్ మింది పాల్గొని మాట్లాడారు. అనునిత్యం దైవ చింతనతో మెలగాలని సూచించారు. దేవుడు చేసిన ఉపకారాలు మరువరాదన్నారు. ఆరాధన అనంతరం నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

పింఛనిచ్చావు.. బువ్వ పెట్టావు.. మందులిచ్చావు.. ఇంటికి పెద్ద కొడుకులా అడుగడుగునా ఆదుకున్నావు. నీ దగ్గరకు మేము రాలేం. ఇప్పుడు నువ్వే వచ్చావు.. నిను చూడకుండా ఉండలేం కొడుకా.. పేదల కోసం క్రూరమృగాలు, గుంటనక్కలు, తోడేళ్లతో యుద్ధం చేస్తున్నావు. జాగ్రత్త నాయనా.. క్షేమంగా వెళ్లి సీఎంగా తిరిగి రా.. అంటూ అవ్వాతాతలు జననేత జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సందర్భంగా దీవెనలు అందజేశారు. యువతీ యువకులు సీఎం సీఎం అంటూ నినదించారు. విశాఖ నగరంలో సీఎం బస్సుయాత్రకు అనూహ్య రీతిలో స్పందన కానవచ్చింది. ఆయనను ప్రత్యక్షంగా చూసేందుకు పార్టీ శ్రేణులు సాధారణ ప్రజలు కూడా ఉవ్విళ్లూరారు.

జననేత.. హృదయ విజేత


సీఎం జగన్ బస్సు యాత్ర సందర్భంగా 33వ వార్డులో అభివాదం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్


33వ వార్డు నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం జగన్ బస్సు యాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన పార్టీ శ్రేణులు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రకు తరలి వెళ్తున్న జాన్‌వెస్లీ, అలపన కనకరెడ్డి, పార్టీ శ్రేణులు

- సీఎం జగన్‌ను చూసేందుకు పోటీ పడ్డ కార్యకర్తలు, అభిమానులు

దాబాగార్డెన్స్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ విశాఖలో పర్యటిస్తున్న సందర్భంగా ఆయనను చూసేందుకు జనం పోటెత్తారు. జీవీఎంసీ 41, 27 వార్డుల్లో జగన్‌మోహన్ రెడ్డి రోడ్‌షో సాగింది. ఉత్తర నియోజకవర్గం నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రైల్వేన్యూకాలనీ (41వ వార్డు)లోకి జగన్ రోడ్ షో ప్రవేశించింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో పలు వార్డుల నుంచి అశేష జనవాహిని సీఎం జగన్‌కు స్వాగతం పలికింది. అక్కడి నుంచి శ్రీకన్య థియేటర్, టీఎస్ఎన్ కాలనీ మీదుగా 27వ వార్డు పరిధి డొండపర్తికి జగన్ బస్సు యాత్ర చేరుకుంది. అక్కడి నుంచి ఎరుకుమాంబ గుడి మీదుగా ఉత్తర నియోజకవర్గ పరిధి అక్కయ్యపాలెం చేరుకుంది. రోడ్ షో పొడవునా నృత్యాలు.. యువత కేరింతలు.. జై జగన్.. జైజై జగన్ నినాదాలతో మార్మోగింది. మహిళలు.. యువకులు పెద్ద ఎత్తున జగనన్నను చూసేందుకు ఉరకలేశారు. నియోజకవర్గంలోకి జగన్‌మోహన్‌రెడ్డి అడుగు పెట్టగానే కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొట్టారు. వేలాదిగా తరలి వచ్చిన జన సందోహాన్ని చూసి సీఎం జగన్ ప్రతి ఒక్కరినీ బస్సుపై నుంచే చేతులు ఊపుతూ ఆప్యాయంగా పలకరిస్తూ ఆకట్టుకున్నారు. జగన్‌తో పాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ తదితరులు బస్సు యాత్రలో పాల్గొన్నారు.

ముస్లింల అభివాదం..

న్యూకాలనీ జంక్షన్ మసీదు వద్దకు చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లింలు సలాం చేస్తూ అభివాదం తెలిపారు.

చల్లబడ్డ వాతావరణం..

ఉదయం నుంచి అగ్గికుంపటిలా మండిపోతున్న ఎండ మధ్యాహ్నం 3 తర్వాత చల్లబడింది. దీంతో సీఎం జగన్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

32,33,34 వార్డుల నుంచి..

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రకు అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతం గుండా జగనన్న బస్సు యాత్ర వస్తుందని తెలిసిన అభిమానులు ఉత్సాహంగా తరలి వెళ్లారు. 32,33,34 వార్డుల నుంచి వేలాదిగా కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు పయనమయ్యారు. జై జగన్.. జై వాసుపల్లి అంటూ బస్సుయాత్ర సందర్భంగా నినాదాలు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ వారిలో ఉత్సాహం నింపుతూ వారితో పాటు అడుగు కలిపారు.


బోర విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న బస్సుయాత్రకు తరలి వెళ్తున్న కార్యకర్తలు


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

35వ వార్డు నుంచి..

జగదాంబ : జగనన్న బస్సు యాత్రకు సంఘీభావం తెలుపుతూ జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ కూడా బృందంతో కలసి వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు జై అంటూ కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు.



బోణి దేవ ఆధ్వర్యంలో సీఎం జగన్ బస్సు యాత్రకు తరలిన 32వ వార్డు కార్యకర్తలు

నమ్మి.. నట్టేట మునిగాం

- అయోమయంలో టీడీపీ క్యాడర్
- దిక్కుతోచని స్థితిలో సీతంరాజును నమ్ముకున్న చోటామోటా నాయకులు
- ఆధిపత్యం చెలాయించాలనుకున్న కార్పొరేటర్ల పరిస్థితీ అదే

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు అయోమయంలో పడ్డారు. నియోజకవర్గ టీడీపీ టికెట్ ఆశించిన గండి బాబ్జీకి ఆ పార్టీ అధినేత చంద్రబాబు చుక్కలు చూపించిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా ఆ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. దీంతో రెండు.. మూడు రోజుల పాటు పార్టీ గుమ్మం ఎక్కని గండి బాబ్జీకి ఏదో సర్ది చెప్పి పార్టీ అధ్యక్ష పదవి అప్పగించారు. దాంతో పాటు విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా గండిని చూసుకోమన్నారు. అతనికి నియోజకవర్గంలోని పలు వార్డుల్లో ఎంతో కొంత కేడర్ ఉంది. ఇదిలా ఉండగా.. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాభావం పాలైన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి, తెలుగుదేశం పార్టీ తరపున టికెట్ ఆశించి చంద్రబాబునాయుడు సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. టీడీపీలోకి వెళ్తూ వెళ్తూ.. తన కోటరీని ఆ పార్టీలోకి తీసుకెళ్లాడు. అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఎన్నికల ప్రచారంలో బల నిరూపణకు దిగాడు. టికెట్ ఎలాగైనా సాధించాలన్న తపన సీతంరాజులో ఉన్నప్పటికీ చంద్రబాబు సీతంరాజు ఆశలకు గండికొట్టారు. చివరకు అనుకున్నది సాధించకపోగా.. తూతూ మంత్రంగా ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడిగా సీతంరాజు సుధాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పి పుండు మీద కారం జల్లారు.

సీతంను నమ్ముకున్న వారంతా నట్టేట మునిగారు..

దక్షిణ నియోజకవర్గంలో తనకంటూ ఓ కోటరీని ఏర్పరచుకున్న సీతంరాజు నమ్ముకున్న వారిని నట్టేట ముంచాడు. అతని వెంట వెళ్లిన వారంతా అయోమయంలో పడ్డారు. ఆర్థికంగా బలంగా ఉన్న సీతంరాజు వెంట ఉంటే ఎంతో కొంత వస్తుందని ఆశించిన వారంతా ఇప్పుడు ఏం చెయ్యాలో తెలియక సందిగ్ధంలో పడ్డారు. టీడీపీలో చేరిన వారిలో చాలా మందిలో బ్యాక్ టు పెవిలియన్ అనే నినాదం వినిపిస్తోంది. సుధాకర్‌ను నమ్ముకుని వచ్చాం. మా నాయకుడు(సీతంరాజు సుధాకర్)కి దక్షిణ నియోజకవర్గ పగ్గాలు ఇస్తారనుకుంటే.. బొమ్మ బోర్లా పడిందని చెవులు కొరుక్కుంటూ.. మాకేంటి ఇలా జరిగిందని కొట్టుమిట్టాడుతున్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీలో కనీసం ఏదో పదవైనా ఉంది. ఇక్కడ పదవి కాదు కదా.. స్పందించే నాథుడే కరువయ్యాడంటూ సీతంరాజు సుధాకర్ వెంట తెలుగుదేశం పార్టీలో ఇటీవల చేరిన వారంతా లబోదిబోమంటున్నారు. సీతంరాజును నమ్ముకున్న కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు, విల్లూరి భాస్కరరావు కూడా వారి వార్డుల్లో ఆధిపత్యం కనబరుద్దామనుకుని చివరకు చతికిలపడ్డారు. ఆయా వార్డుల్లో గండి బాబ్జీ అనుచరులుగా ఉన్న ఆయా వార్డుల అధ్యక్షుల హవా కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగదాంబ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. హార్బర్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం 12.50 గంటల సమయంలో దాదాపు 50 సంవత్సరాలున్న వ్యక్తి కాన్వెంట్ జంక్షన్ నుండి షీలానగర్ వెళ్తుండగా ఏపీ 31 టీటీ 6732 నంబర్ గల లారీ ఢీకొట్టి అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి శరీరం నుజ్జునుజ్జు అయి అతను మృతి చెందాడని తెలిపారు. 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, తెలుపు, నీలం చారల షర్టు, నల్ల ఫ్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం


సమ్మర్ క్యాంప్‌లో చిన్నారుల కేరింతలు

కంచరపాలెం: స్థానిక రవీంద్రనగర్‌లోని బీఎస్ఆర్ ఫౌండేషన్‌లో ఆసరా చారిటబుల్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మర్ క్యాంప్‌ను సంస్థ కన్వీనర్ కె.సుశీల ప్రారంభించారు. సెల్ఫ్ డిఫెన్స్, చిత్రలేఖనం, పుస్తక పఠనం, చేతిరాత, చెస్, డ్యాన్స్, క్రాఫ్ట్, స్కిట్ తదితర అంశాలపై 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని నిర్వాహకుడు శ్రీనాథ్ తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులు ఉత్సాహంగా స్కిట్లు ప్రదర్శించి కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో జోన్ సభ్యులు అప్పారావు, కృష్ణారావు, పుష్ప, మణి, కల్యాణి, భవాని, వసంత, హారిక, నిఖిల, శ్రావ్య, మౌనిక, ఉషశ్రీ, స్వర్ణ, తులసి, దీక్షిక, లక్ష్మిప్రియా, ప్రణతి, మాన్యా, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి మహోన్నతమైనది


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

దాబాగార్డెన్స్ : భారతదేశ సంస్కృతి మహోన్నతమైనదని రామకృష్ణా మిషన్ స్వామి గుణేషానంద పేర్కొన్నారు. రామకృష్ణామిషన్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ ప్రాంత్, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ బిల్డింగ్‌లో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా గుణేషానంద మాట్లాడుతూ భారతీయులుగా జన్మించడం మన పూర్వజన్మ సుకృతమన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలకు భారతదేశం నిలయమన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు దేశభక్తి అలవరచుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద ఆశయాలతో భారత్ వికాస్ పరిషత్ స్థాపించడం గొప్ప విషయమన్నారు. బీవీపీ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు నేతృత్వంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. 2024–25 ఏడాదికి విశాఖపటణం ప్రాంత్ అధ్యక్షుడిగా వంకాయల సన్యాసిరాజు, కార్యదర్శిగా జీబీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా టి. సాయికృష్ణ ఎన్నిక కాగా, బీవీపీ విశాఖ శాఖ అధ్యక్షుడిగా సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శిగా పి. భాస్కరరావు, కోశాధికారిగా జీఎస్‌వీ మాణిక్యాలరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం బీవీపీ ఝాన్సీ లక్ష్మీభాయి నారీశాఖకి అధ్యక్షురాలిగా న్యాయవాది పి. షర్మిల, కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్ నిర్మల, కోశాధికారిగా వి. భువనసుందరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజన్ వలయ్తాన్, రమేష్ చంద్‌జైన్, పురుషోత్తమశాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, ఎస్. గోపాలరావు, పి. వెంకటేశ్వరరావు, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ముస్లింలను విస్మరించింది


మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నేత హైదర్ ఆలీ షింకా

దాబాగార్డెన్స్ : కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా ఉండే ముస్లింలను విస్మరించడం దారుణమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు హైదర్ ఆలీ షింకా ఆవేదన వ్యక్తం చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో షింకా మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉంటూ అహర్నిశలు పని చేసిన స్థానిక ముస్లిం నాయకులకు సీటు ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ జెండా మోయని జనసేన పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి సీటు కేటాయించడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం డబ్బుకు అమ్ముడుపోయిందని చెప్పారు. ముస్లింలకు సీటు కేటాయించాలని, సామాజిక న్యాయం చేయాలని షింకా డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కొందరు టికెట్లు అమ్ముకోవడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. సమావేశంలో మహబూబ్ షరీఫ్, షేక్ షాను, బుకారి మహ్మద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు చర్యలు



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి

మురళీనగర్: వాకర్స్ పార్కులో పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ పార్కులో నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో సభ్యత్వ నమోదుకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నూతన సభ్యులు చేరడం వల్ల రూ.1 లక్షలు మూలనిధికి జమ చేశామని, తద్వారా మూలనిధి రూ.13 లక్షలకు చేరిందని చెప్పారు. మూలనిధి పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సభ్యులు సహకరించాలని కోరారు. ఈ వేసవిలో విద్యార్థులకు ఉపయోగపడేలా ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి చెస్ క్రీడలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, టి.వి.రమణ, పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య ,ఆర్.సత్యనాథం, ఎం.భాస్కరరావు, కేజీ కృష్ణారావు, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, బోర్డు సభ్యులు విజయలక్ష్మి, వి.అప్పారావు, ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.శ్రీనివాసరావు, వైదేముడు,పి.శ్రీనివాసరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నసంతర్పణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు గవర తాటిచెట్లపాలెంలోని హనుమాన్ సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్ ప్రారంభిచారు. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు అన్నప్రసాదం స్వీకరించారు. ద్వారం సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ గౌరవాధ్యక్షులు సదరం నూకరాజు, సదరం ఆంజనేయులు, గౌరీశంకర్, మారుతి వెంకట అప్పారావు, వేగి శ్రీను, సదరం గోవింద, సదరం శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

విజయవంతంగా చిత్రలేఖనం పోటీలు


తాము గీసిన పెయింటింగ్స్‌తో చిన్నారులు

మద్దిలపాలెం: ధరిత్రి దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు విజయవంతంగా జరిగాయని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు తెలిపారు. మాధవధార వుడా కాలనీలోని పీసీబీ కార్యాలయంలో ఆదివారం ఎకో వైజాగ్‌లో భాగంగా ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే థీమ్‌తో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద మాట్లాడుతూ చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారని, ముఖ్యంగా అమ్మాయిలు ఎక్కువగా పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్రమ జడ్జి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్విరాన్మెంట్ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఇ.యు.బి.రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు మరిన్ని ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంస్కృత భారతి జానపద సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు


జానపద సమ్మేళనానికి హాజరైన కళాకారులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షి నగర్‌లోని బీవీకే కళాశాలలో ఆదివారం విశాఖ సంస్కృత భారతి జానపద సమ్మేళనం ఘనంగా జరిగింది. జిల్లాలో సంస్కృత భాష అభిమానులు సుమారు 300 మంది వరకు పాల్గొనడంతో ఈ సమ్మేళనం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకగా సాగింది. సంస్కృత విజ్ఞాన ప్రదర్శన, వస్తు ప్రదర్శన, పుస్తక ప్రదర్శన, రసాయనాలు లేని ఆయుర్వేద వనమూలికల నుంచి తీసి అద్దిన రంగులతో తయారు చేసిన వస్త్రాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు సంస్కృత భాషలో హాస్య నాటికలు, నృత్యాలు, గీతాలతో అలరించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సుందర్‌రాజ పెరుమాళ్ మాట్లాడుతూ సంస్కృత భాష వాంగ్మయంలో మానవ స్థితి నుంచి దైవ స్థితికి ఎదగడానికి అవసరమైన జ్ఞాన సర్వస్వం ఉంటుందన్నారు. సంస్కృతం నేర్చుకోవడం ద్వారా ఉన్నత స్థితికి వెళ్లవచ్చన్నారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పి.సోమరాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, భాగవతుల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు


నృత్యప్రదర్శనలో కళాకారులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం స్వామి వారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం సాయంత్రం సూర్యప్రభవాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.